సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



ఫైనాన్స్ కంపెనీ కార్యాలయానికి తాళం

ఓ ఫైనాన్స్ కంపెనీ కార్యాలయానికి ఖాతాదారులు తాళం వేశారు. తాకట్టు పెట్టిన బంగారాన్ని మరొకరి పేరుతో తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడంతో అలజడి నెలకొంది. -8లో



స్టెమి ప్రాజెక్టుతో గుండెకు భరోసా

హార్ట్ ఎటాక్ కేసుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ఏ మాత్రం ఆలస్యం చేసినా పేషెంట్ ప్రాణాలకే ప్రమాదమని కార్డియాలజిస్టు హెచ్చరిస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.170
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 50 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



వీరభద్రస్వామి ఆలయ గోపురాన్ని శుభ్రం చేస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

రాయచోటి టౌన్: శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారులు, ఫైర్ ఇంజిన్‌తో ఆలయ ప్రధాన గోపురాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉపకాలువకు తూముల ఏర్పాటు

బి.కొత్తకోట: హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువపై బ్రిడ్జిలు, చెరువులకు నీటిని మళ్లించే తూముల ఏర్పాటు జరుగుతుందని ప్రాజెక్టు ఎస్ఈ విఠల్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీబీసీకి జరుగుతున్న లైనింగ్ పనులు, దానికి అనుబంధంగా చేపట్టే పనులపై ఈఈలతో సమీక్షించామని చెప్పారు. పుంగనూరు ఉపకాలువ వెళ్లే మార్గంలో ఒకవైపు గ్రామాలు, మరోవైపు పొలాలు ఉంటాయన్నారు. ఇటు నుంచి అటు నుంచి వైపుకు రాకపోకలు సాగేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువపై బ్రిడ్జిలను నిర్మిస్తారని చెప్పారు. అలాగే చెరువులకు నీళ్లను తరలించేలా నిర్ణయించిన చోట్ల కాలువకు తూములు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెరువులకు నీటిని తరలించేందుకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. లైనింగ్ పనులు ఆరునెలల్లో పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒప్పందం మేరకు పనులు చేయిస్తామని తెలిపారు.

రూ.18 కోట్లతో పాపాఘ్ని, కంబాలపల్లె బ్రిడ్జిలు



బి.కొత్తకోట: బి.కొత్తకోట–బెంగళూరు మార్గంలో కంబాలపల్లె, బి.కొత్తకోట–చెన్నరాయునిపల్లె మార్గంలో పాపాఘ్ని నదిపై రూ.18 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని రహదారి భవనాలశాఖ మదనపల్లె ఈఈ అరవిందాదేవి చెప్పారు. శనివారం బి.కొత్తకోటలో రోడ్లపై ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన ఈ బ్రిడ్జిల పనులు చేపట్టకపోవడంతో కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం కోసం టెండర్ల నిర్వహణకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. ఈఈ డివిజన్ పరిధిలో 727 కిలోమీటర్ల రోడ్లు ఉండగా అందులోని గుంతలను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.5.70 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటిదాకా 600 కిలోమీటర్ల రహదారుల్లోని గుంతలను పూడ్చినట్టు చెప్పారు. మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై తారురోడ్డు పనులకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు. బడికాయలపల్లి రోడ్డుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టెండర్లు జరిగాయని, పనులు మొదలు కాకపోవడంతో రద్దయినట్టు చెప్పారు. దీని పనులకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

కార్మికులు గుర్తింపు కార్డు పొంది ఉండాలి



మాట్లాడుతున్న రూపేష్‌కుమార్

రాజంపేట టౌన్: కార్మికులందరు విధిగా గుర్తింపు కార్డు పొంది ఉండాలని కార్మికశాఖ జిల్లా సహాయ కమిషనర్ పద్మావతి, రాజంపేట కార్మికశాఖ అధికారి రూపేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. 110 రూపాయల నగదు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఇస్తే ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు గాలి చంద్రయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు వెంకటయ్య, సంఘం ప్రతినిధులు మొహమ్మద్ హుస్సేన్, వై.నరసింహా, కె.ఈశ్వరయ్య, మల్లికార్జున, పి.సుబ్రమణ్యం, ఈ.రమణ, ఆంజనేయులు, రంగస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ టెర్రర్



- తగ్గిన చికెన్ కొనుగోళ్లు
- ముక్క ముట్టేందుకు జంకుతున్న జనం
- అప్రమత్తమైన పశు వైద్యాధికారులు
- ఆందోళన వద్దంటున్న అధికార యంత్రాంగం

రాయచోటి: బర్డ్ ఫ్లూ సెగ జిల్లాకు పాకింది. బర్డ్ ఫ్లూపై వస్తున్న ప్రచారాలతో జిల్లాలో మాంసం ప్రియులు చికెన్ తినేందుకు భయపడుతున్నారు. దీంతో చికెన్ అమ్మకాలు చాలా వరకు మందగించినట్లు వ్యాపారులు తెలిపారు. చాలామంది ముక్క ముట్టేందుకు జంకుతున్నారు.చికెన్ ధరలు కూడా కాసింత తగ్గుముఖం పట్టాయి. ముందస్తు చర్యల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ అధికారులు కోళ్ల పెంపకం దారులను అప్రమత్తం చేస్తూ బర్డ్‌ఫ్లూ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదని, సమీప జిల్లాలో కూడా ఈ వ్యాధి లక్షణాలు కనిపించ లేదని, కావున ఎవరూ భయపడొద్దని సూచిస్తున్నారు. పశుసంవర్ధక అధికారులు కోళ్ల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించారు. కోళ్ల పెంపకందారులు కోళ్లకు చిన్న జబ్బు వచ్చినా వైద్యులకు సమాచారం అందిస్తున్నారు. పొరపాటున కోళ్లు చనిపోతే ఏ జబ్బుతో చనిపోయిందో డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు. అధికారుల సూచనలు సలహాలను పాటిస్తూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.





రాయచోటి ప్రాంతంలో నిర్మించిన ఎన్విరాన్‌మెంటల్ కోళ్ల ఫారంలో పెంచుతున్న కోళ్లు

జిల్లాలో ఎక్కడెక్కడంటే..

జిల్లాలో 36 లక్షల మేర వివిధ రకాల కోళ్ల పెంపకం ఉంది. మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి, రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లో కోళ్ల పెంపకాలు అధికంగా ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. బర్డ్‌ఫ్లూ భయం నేపథ్యంలో వీటికి సంబంధించిన యజమానులకు షెడ్లు, కోళ్లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి తగిన సూచనలు, సలహాలను ఇచ్చినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.

సత్వర స్పందన బృందాలు...

కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధిని దృష్టిలో ఉంచుకుని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ గుణశేఖర్‌పిళ్లై ఆధ్వర్యంలో మండలానికి ఒక సత్వర స్పందన బృందం ఏర్పాటైంది.ఆయా మండలాల పరిధిలో ఉన్న కోళ్ల ఫారాలపై నిఘా ఉంచారు. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మేర చర్యలు తీసుకోవడానికి వైద్య బృందం అందుబాటులో ఉంటుంది. కోళ్లకు ఎలాంటి వ్యాధి సోకినా ఫారం యజమానులు సమాచారం అందిస్తే వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్లి కోళ్లకు పరీక్షలు నిర్వహించి చర్యలు చేపడతామని జాయింట్ డైరెక్టర్ వివరిస్తున్నారు.

వ్యాధి వ్యాప్తి చెందే పక్షి జాతులు

బర్డ్‌ఫ్లూ వ్యాధి తెల్ల జాతిఫారంకోళ్లలో, గిన్నె కోళ్లు, టర్కీ కోళ్లు, బాతులు, కొంగలు, వన్య పక్షులు, నెమళ్లు, విదేశీ పక్షుల ద్వారా కూడా వ్యాపించవచ్చు. ముక్కు, కళ్ల వెంబడి నీరు కారడం, మెడ వాల్చడం, నీరసంగా ఉండటం, కాళ్ల శరీర భాగాలపై మచ్చలు ఏర్పడటం, విరేచనాలు ఎక్కువ కావడం కోళ్లలో గమనించవచ్చు. ఈ వ్యాధి తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నపుడు ఎక్కువ శాతం కోళ్లు మరణించే అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారులు తెలిపారు.



తగ్గిన ధరలు



బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో జిల్లాలో కోడిమాంసం, గుడ్ల ధరలు కొంత మేర తగ్గుముఖం పట్టాయి. మాంసం విక్రయాలు కూడా 20 శాతం పైగా తగ్గాయని చికెన్ వ్యాపారులు తెలిపారు. మొన్నటి వరకు స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.210 ఉండగా, మామూలు చికెన్ కిలో రూ.190 ధర ఉండేదని వ్యాపారులు తెలిపారు. బర్డ్‌ఫ్లూ వదంతులు వచ్చాక స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.170కి తగ్గిందని వ్యాపారులు తెలిపారు. అలాగే కోడిగుడ్లు హోల్ సేల్ షాపుల్లో మొన్నటి వరకు డజన్ రూ.79 ఉండేదని ప్రస్తుతం ధర తగ్గి కిలో రూ.59 వచ్చిందని గుడ్ల వ్యాపారస్తులు తెలిపారు. ఏదిఏమైనా జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేకపోయినా మాంసం ప్రియులను మాత్రం భయం పట్టుకుంది.



జిల్లాలో బాయిలర్ కోళ్లఫాంను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

మనుషులకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఇలా..

మనుషుల్లో బర్డ్‌ఫ్లూ లక్షణాలు సాధారణ ఫ్లూను పోలి ఉంటుందని వైద్యులు తెలిపారు. ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి దగ్గు, విరేచనాలు, జ్వరంతో పాటు శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతాయి. వీటితో పాటు తలనొప్పి, కండరాల నొప్పి, ముక్కు కారటం, గొంతునొప్పి కూడా అనిపించవచ్చు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఉన్న వారిని వేరే గదిలో ఉంచడం మంచిది. లేకపోతే మరొకరికి సోకే ప్రమాదం ఉంటుంది. వైద్యనిపుణుల సలహాలు తీసుకొని తగిన మందులు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.



అమ్మకాలు తగ్గాయి



నాలుగు రోజుల నుంచి చికెన్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. వైరస్ ఎఫెక్ట్ మనకు లేకపోయినా భయంతో ఎవరూ ముందుకు రావడం లేదు. మరో నాలుగు రోజులు ఉంటే మళ్లీ కొనుగోళ్లు ఊపందుకుంటాయి. –ఎం.గౌస్‌మొద్దీన్, ఎంఎస్ చికెన్ వ్యాపారి, రాయచోటి

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఎన్విరాన్‌మెంటల్ కోళ్ల ఫారం ద్వారా 30 వేల కోళ్లను పెంచుతున్నాను. పశువైద్యాధికారులు కోళ్ల ఫారాలను పరిశీలించి తెగుళ్లు లేవని నిర్ధారించారు. కోళ్ల ఫారాల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలి. – శ్రీనివాసులు రెడ్డి, కోళ్ల ఫారం యజమాని, రాయచోటి

ఆందోళన అవసరం లేదు

జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు నమోదు కాలేదు. మాంసం ప్రియులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కోళ్ల పెంపకందారులకు శానిటేషన్, రక్షణ చర్యలపై సూచనలు ఇచ్చాం. జిల్లాలోని ప్రతి కోళ్లఫారాన్ని వైద్యులు బృందాలుగా సందర్శించి చర్యలు తీసుకుంటున్నారు. కోడిగుడ్లు, మాంసాన్ని బాగా ఉడికించి తినాలి. – గుణశేఖర్‌పిళ్లై, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ

‘భరోసా’తో అవగాహన కార్యక్రమాలు

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మదనపల్లి: మహిళలు, యువతులు, చిన్నారులపై వేధింపులు, లైంగిక దాడులను అరికట్టేందుకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భరోసా పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాల్లో విస్తృతంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు ఇందులో భాగస్వామ్యం కల్పించి, పిల్లల ప్రవర్తన, స్నేహాలు, ఇతర అంశాలపై దృష్టి పెట్టి బాధ్యతతో పర్యవేక్షణ జరిపేలా చూస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. సంక్షేమ హాస్టళ్లు, కాలేజీల్లో డ్రాప్‌బాక్స్‌లు ఏర్పాటు చేయనున్నామని, గోప్యత కావాలనుకున్న బాధితులు అందులో తమ సమస్యను వేయడం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. జిల్లాలో యాసిడ్ దాడి ఘటన జరగడం దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా యువ కులు సైకో ప్రవర్తన, నేర మనస్తత్వం కలిగి ఉంటే, వారి వివరాలను పోలీసులకు తెలిపితే, వారిపై ప్రత్యే క నిఘా ఉంచి నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై ఎలాంటి దాడులు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో పోలీస్ వాట్సాప్ ఛానల్‌ను ప్రారంభించామని, ప్రజా జీవనానికి సంబంధించి అవగాహన, ఇతర అంశాలను అందులో తెలపడం చేస్తామని, ప్రతి ఒక్కరూ అన్నమయ్య పోలీసు వాట్సాప్ ఛానల్ ఫాలో కావడం ద్వారా సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

దాతృత్వం అభినందనీయం

రాయచోటి: ఇంటి గృహాలపై ‘సూర్య ఘర్’ పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించడానికి సామాజిక బాధ్యత కింద సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్ల ఏర్పాటు నిమిత్తం అర్చన విద్యాసంస్థల యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని చాంబర్లో రాయచోటి అర్చన విద్యాసంస్థల కరెస్పాండెంట్ పి.మదన్‌మోహన్‌రెడ్డి రూ.5.7 లక్షల విలువ గల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. . ఆయనను స్పూర్తిగా తీసుకొని మరింత మంది దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల ప్రతినిధి భరత్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్




పంచలింగాల వద్ద వివిధశాఖల అధికారులతో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్

సిద్దవటం: మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పేర్కొన్నారు.సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలో వెలసిన నిత్యపూజ స్వామి మహాశివరాత్రి ఉత్సవాలపై శనివారం పంచలింగాల వద్ద అధికారులతో ఆర్డీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచలింగాల వద్ద, కాలినడక మార్గంలో, ఆలయం వద్ద మొత్తం మూడు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. శానిటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపేలా చూడాలని తెలిపారు. భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని దేవదాయశాఖ అధికారులకు సూచించామన్నారు. 108, 104 వాహనాలను పంచలింగాల వద్ద అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఒంటిమిట్ట సీఐ బాబు మాట్లాడుతూ 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.పంచలింగాల వద్ద, ఆలయం ఆవరణలో రెండు వైర్‌లెస్ సెట్లను అమరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, ఆర్డీ ఏఓ శంకర్ రావు, రేంజర్ కళావతి, వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, సర్పంచ్ ప్రతినిధి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పర్యాటక అభివృద్ధికి

గండి కొడతారా.. కోట కడతారా!

- సీఎం నోట ‘గండికోటకు బ్రాండింగ్ స్టేటస్’
- గతంలో చెప్పిన వాటికే మోక్షం లేదని పర్యాటకాభిమానుల నిట్టూర్పు
- ప్రణాళికల పేరుతో కాలయాపన వద్దని హితవు



గండికోట పెన్నా లోయ



గండికోటలో ట్రెక్కింగ్ సందడి

కడప కల్చరల్: కూటమి ప్రభుత్వం జిల్లా పర్యాటకాభివృద్ధికి పథకాల ఊరింపుతోనే సరిపెడుతోంది. ప్రణాళికల పేరిట గడువు పెడుతూ కాలయాపన చేస్తోంది. జిల్లా పర్యాటకంపై ప్రత్యేకమైన ప్రేమ కురిపిస్తున్నట్లు నటిస్తూ.. అమల్లోకి వచ్చేసరికి రిక్తహస్తం చూపిస్తోంది. ఇందులో భాగంగానే గురువారం సంబంధిత మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా జిల్లాలతోపాటు వైఎస్సార్ జిల్లా పర్యాటకానికి కూడా పలు వరాలు కురిపించారు. ప్రధానంగా గండికోటపై దృష్టి సారించారు. దేశంలోనే ఇలాంటి ప్రాంతం లేదని, ఈ అద్భుతమైన ప్రాంతం వన, జల, గిరిదుర్గంగా ప్రాధాన్యత సంతరించుకుందని ప్రశంసించారు. గండికోటను బ్రాండింగ్ చేయాలని, టెంట్ సిటీగా ప్రకటించాలని కూడా సూచించారు. సాస్ కీ పథకంలో భాగంగా గండికోటను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిశ్చయంతో ఉందని వెల్లడించారు. ఇప్పటికే గండికోటను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. జిల్లాలోని పెద్దదర్గా, గండికోట, ఒంటిమిట్ట, సోమశిల ప్రాంతాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికల్లో చోటు కల్పించారు. ఇంకా జిల్లాకు సంబంధించి పర్యాటకంగా పలు పథకాలు సూచించారు. పథకాల ఊరింపు బాగానే ఉంది.. వీటి అమలు ఎప్పుడని పర్యాటకాభిమానులు ప్రశ్నిస్తున్నారు. కోటలు దాటే మీ మాటల్ని కట్టిపెట్టి... ఈసారైనా వాటిని అమలు చేయండి బాబూ.. అంటూ విన్నవిస్తున్నారు.

అభివృద్ధి ఎలా?

పర్యాటకరంగంలో ఆతిథ్యరంగం విశేషమైన ప్రాధాన్యత కలిగి ఉందని, వీటిని పర్యాటకులకు స్వర్గధామంగా మలిచి ఈ సంవత్సరం 20 శాతం అభివృద్ధి రేటు సాధించాలని సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారు. కానీ ఆయన హయాంలో ఇంతవరకు జిల్లాలో ఒక్క పర్యాటక హోటల్ నిర్మించిన దాఖలాలు లేవు. మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో జిల్లాలో ‘హరిత’ పేరిట ఏడు పర్యాటక హోటళ్లను నిర్మించి పర్యాటకం అన్న పదానికి ఎనలేని గ్లామర్, ప్రాధాన్యత కల్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కడప నగరంలోని ప్రధాన హరిత హోటల్‌ను మరమ్మతుల పేరుతో ఆర్నెళ్లుగా పలు గదులను వసతికి దూరం చేయడం గమనార్హం. ప్రతి పథకానికి ప్రణాళిక దశలోనే కనీసం మూడు మాసాలు గడువు పెడుతుండడం ఆర్థికంగా ఎలాంటి విడుదలలు లేకపోవడంతోనే ఇంత కాలయాపన జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి.

టెంట్ సిటీగా...?

గండికోటకు వస్తున్న పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ఉన్న పర్యాటకశాఖ హోటల్ గదులు చాలక అన్ సీజన్‌లో 600–700 టెంట్లు వేస్తున్నారు. సీజన్‌లో వెయ్యికి పైగా డిమాండ్ ఉంది. కానీ ఆ మేరకు ఆదాయం మాత్రం కనిపించడం లేదు. పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణం.

గండికోట ఉత్సవాలేవీ?

ఇంతకుముందు వరుసగా గండికోట వారసత్వ ఉత్సవాలు నిర్వహించడంతో దానికి ఎనలేని ప్రచారం లభించింది. దీని ప్రత్యేకతలు తెలుసుకున్న వారంతా దీన్ని గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా కొనియాడుతూ యునెస్కో గుర్తింపుకోసం ప్రయత్నించాలని సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇలాంటి ప్రయత్నాలేవీ చేయకపోవడం వారి చిత్తశుద్ధి లోపానికి నిదర్శమని ఈ ప్రాంత పర్యాటకాభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు.


గత పథకాల మాటేమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలపై జిల్లా పర్యాటకాభిమానుల్లో నమ్మకం సన్నగిల్లింది. ఇంతకుముందు అధికారం (2014–19)లో ఉన్నప్పుడు గండికోటను అభివృద్ధి చేస్తామని ఇలాంటి వాగ్దానాలే చేశారు. రోప్‌వే ఏర్పాటు చేస్తామని చెప్పడంతోపాటు కొద్దిగా సామాగ్రిని కూడా తెప్పించి హడావుడి చేశారు. ఆ తర్వాత ఆయనగానీ, సంబంధిత అధికారులుగానీ దాని గురించి పట్టించుకోలేదు. ఎప్పటికప్పుడు చూస్తాం...చేస్తాం అంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నారేగానీ చేసిన వాగ్దానం మాత్రం కార్యరూపంలోకి రాలేదు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను ట్రెక్కింగ్ అభివృద్ధి ఎంపిక చేసినట్లు చెబుతున్నా గండికోటలో అంతకుముందే నిర్మించిన అడ్వెంచరస్ అకాడమి అభివృద్ధిపై కూడా ఏమాత్రం దృష్టి సారించలేదు. దీంతో ఇన్‌స్టిట్యూట్ కార్యాచరణ లేక వెలవెలబోతోంది.

‘స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్’లో భాగస్వాములు కావాలి

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలో నిర్వహించే ‘స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్’కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి శనివారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు డీఆర్‌ఓ, ఏఓ, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది కలెక్టరేట్ కార్యాలయ పరిసరాల్లో శనివారం ‘స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్’కార్యక్రమాలను నిర్వహించారు. కలెక్టరేట్ పరిసరాలలో ఉన్న చెత్తను, ప్లాస్టిక్‌ను ఏరివేసి శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ‘స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్’ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నెలకొకటి చొప్పున 12 మాసాలకు 12 అంశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి మాసంలో ‘‘వనరు–మూల వనరు’’అంశంతో స్వచ్ఛ కార్యక్రమాలను పాటిస్తున్నామన్నారు. అనంతరం పాల్గొన్న వారందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో చెత్త తోస్తూ శ్రమదానం చేస్తున్న డీఆర్‌ఓ మధుసూదన్‌రావు

క్లుప్తంగా

మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు


అగ్నిప్రమాద నష్టాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రామసముద్రం : మండలంలోని బల్లసముద్రం వద్ద ఉన్న ఆర్. నడింపల్లి గ్రామం బాయప్పకు చెందిన మామిడి తోటకు ఆకతాయిలు శనివారం నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పుంగనూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రమాదంలో మామిడి, నీలగిరి చెట్లు, డ్రిప్ పైపులు అగ్ని ప్రమాదానికి గురై నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదంలో తీవ్ర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలానికి స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి నష్టం అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన శనివారం రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన వెంకటేష్(58), సామండి(30) భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ నారిగానిపల్లెలో నివాసముంటున్నారు. శనివారం పనుల నిమిత్తం చెంబకూరుకు వెళ్లి సాయంత్రం తిరిగి నారిగానిపల్లెకు ఆటోలో బయలుదేరారు. అదే ఆటోలో మదనపల్లె మండలం ఆవులపల్లికు చెందిన అమరప్ప(60) ప్రయాణిస్తున్నాడు. ఆటో చెంబకూరు నుంచి రామసముద్రం వెళుతుండగా మార్గమద్యంలోని నారిగానిపల్లె సమీపంలో బొలేరో వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో అమరప్ప తలకు దెబ్బతగిలి తీవ్రంగా గాయపడగా, వెంకటేష్, సామండిలు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు విచారణ చేస్తున్నారు.

స్టెమి ప్రాజెక్టుతో గుండెకు భరోసా

- గుండె జబ్బు మరణాలను తగ్గించడమే లక్ష్యం
- 2023లో ప్రారంభించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- అత్యవసర ప్రాథమిక చికిత్సతో తగ్గిన గుండె పోటు మరణాలు


ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి


స్టెమిపై జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు(ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : హార్ట్ ఎటాక్ కేసుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ఏ మాత్రం ఆలస్యం చేసినా పేషెంట్ ప్రాణాలకే ప్రమాదమని కార్డియాలజిస్టు హెచ్చరిస్తున్నారు. స్ట్రోక్ వచ్చిన వారిలో 50 శాతం హాస్పిటల్‌కు చేరకముందే చనిపోతున్నారు. తీవ్రమైన కేసుల్లో హాస్పిటల్‌కు వచ్చాక కూడా 90 శాతం మంది మరణించే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఛాతిలో నొప్పి వచ్చాక గంటలోగా హాస్పిటల్‌కు చేరితే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. ఆలస్యమైతే గుండె కండరాలకు శాశ్వత నష్టం ఏర్పడుతుంది. గతంలో గుండె సంబంధిత వ్యాధులు, గుండె పోటుకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర ప్రాథమిక చికిత్స దొరికేది కాదు. జిల్లా కేంద్రాల్లోని బోధనా ఆస్పత్రులు, సూపర్‌స్పెషాలిటి కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఒక వేళ స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే పరీక్షలు, మందుల ఖర్చులు పక్కన పెడితే ఒక్క ఇంజెక్షన్‌కే రూ. 45–50 వేలు వెచ్చించాల్సి వచ్చేది. ఈ మొత్తాన్ని భరించడం పేదలు, మధ్య తరగతి వారికి మిక్కిలి భారంగా మారేది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె జబ్బులకు అత్యవసర ప్రాథమిక వైద్యం లేక, ఖర్చుల భయంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక గుండె జబ్బు వచ్చిన పేదలు, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో గుండెకు భరోసా:
ఏపీలో గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2023లో ‘స్టెమి ప్రాజెక్ట్’కు శ్రీకారం చుట్టింది. గుండె పోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటి గంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను నిలబెట్టే కార్యక్రమమే ఈ స్టెమీ ప్రాజెక్ట్. గుండె పోటు వచ్చిన తొలి గంటలోపే అంటే గోల్డెన్ అవర్‌లోపే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలను నిలబెట్టేందుకు అవకాశం ఉంది. గుండె పోటుకు గురై మరణించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కార్డియాలజి, కార్డియోవాస్క్యులర్ సేవలను మరింత విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలని భావించిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలు, పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో హృద్రోగ చికిత్స అందుబాటులోకి తెచ్చింది. గుండె పోటు వచ్చిన 40 నిమిషాల సమయంలో రోగికి అవసరమైన చికిత్సను అందించి ప్రాణాపాయం నుంచి కాపాడటమే ‘స్టెమీ ప్రాజెక్ట్’ ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. అంతేగాక గోల్డెన్ అవర్‌లో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన గుండె జబ్బు బాధితుడికి రూ. 45 వేల ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు సమీపంలోని హబ్ సెంటర్లకు తరలించి గుండెపోటుకు చికిత్స అందించేలా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గుండె పోటు వచ్చిన వారికి సకాలంలో అత్యవసర ప్రాథమిక వైద్యం అందడంతో చాలా మంది ప్రాణాలతో బయటపడ్డారు.

జిల్లా ఆస్పత్రిలో 36 మందికి టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌లు :
స్టెమి ప్రాజెక్ట్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో 36 మందికి రూ. 45 వేలు విలువ చేసే టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌లను ఉచితంగా వేశారు. ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాలకు చెందిన వీరంతా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన వారే. వీరిలో ఇద్దరు మృతి చెందారని, మిగిలిన 34 మంది ప్రాణాపాయం నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉన్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో ఎప్పటికీ 6 ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంటాయని, ఏ సమయంలో ఆస్పత్రికి వచ్చినా అత్యవసర ప్రాథమిక చికిత్స అందిస్తామని తెలిపారు. టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్‌లు పూర్తిగా ఉచితమన్నారు. అత్యవసర విభాగంలో వైద్యుడితో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఇదే ఇంజెక్షన్ ప్రైవేట్ ఆస్పత్రిలో వేస్తే రూ. 45 వేలు తీసుకుంటారని తెలిపారు. ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం తదితర గుండె పోటు లక్షణాలని పేర్కొన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే 108 అంబులెన్స్ లేదా ఇతర మార్గాల ద్వారా గంటలోపు జిల్లా ఆస్పత్రికి రావాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వెంటనే ఈసీజీ తీస్తారు. రిపోర్టులో గుండె పోటు అని నిర్ధారణ అయితే వెంటనే టెనెక్ట్‌ప్లస్ ఇంజెక్షన్ వేస్తారు. తర్వాత 4–5 గంటల్లోగా బాధితుడిని కడపకు తీసుకెళ్తే అక్కడి రిమ్స్ లేదా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గుండె పోటుకు సంబంధించి ఉచితంగా చికిత్స అందిస్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్టెమి ప్రాజెక్ట్ పథకం పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎంతో మంది ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు.

మొదటి గంటలోపు ఆస్పత్రికి రావాలి



గుండె పోటు వస్తే జిల్లా ఆస్పత్రికి వెంటనే రావాలి. ఆలస్యం చేయకుండా మొదటి గంటలోపు ఆస్పత్రికి చేరుకోవాలి. జిల్లా ఆస్పత్రిలో గుండె పోటుకు అత్యవసర ప్రాథమిక చికిత్స ఇస్తారనే విషయం చాలా మందికి తెలియదు. గుండె పోటు నుంచి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ఖరీదైన రూ.45 వేలు విలువ చేసే టెనెక్ట్‌ప్లస్ ఉచితంగా అందిస్తోంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

లారీ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

కలికిరి(వాల్మీకిపురం) : లారీ ఢీకొని వృద్ధురాలు దుర్మరణంపాలైన ఘటన మండల పరిధిలోని చింతపర్తిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చింతపర్తి ఎస్సీ కాలనికి చెందిన చిన్నస్వామి భార్య మునెమ్మ(60) కాలని వద్ద రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా వాల్మీకిపురం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. సంఘటనా స్థలంలోనే వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల సమచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

సిద్దవటం/ కడప కోటిరెడ్డి సర్కిల్ : మండలంలోని మూలపల్లె గ్రామంలోని మామిడి తోటలో ఉన్న రేకులషెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచి 483 బస్తాల రేషన్ బియ్యంను శనివారం స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి బాల గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ మూలపల్లె గ్రామంలోని బత్తల చిన్నక్క పొలం లోని రేకులషెడ్‌లో రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు స్థానికులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన ఆదేశాల మేరకు తనిఖీలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 483 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు పంచనామా నిర్వహించి బియ్యం బస్తాలను ఒంటిమిట్ట లోని పౌరసరఫరాల గొడన్‌కు తరలించామన్నారు. జంగాలపల్లె పంచాయతీ కమ్మపాలెం కు చెందిన రాజు అనే వ్యక్తి అక్రమ రేషన్ బియ్యం బస్తాలను నిల్వ ఉంచినట్లు విచారణలో తేలిందన్నారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వీఆర్‌వో గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచకులు కొత్త నరసింహులు మృతి


నరసింహులు (ఫైల్)

రాజంపేట టౌన్ : తిరుమల–తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్యాత్మిక ప్రవచకులు విద్వాన్ కొత్త నరసింహులు (70) మృతి చెందాడు. గత కొద్దిరోజులుగా ఆయన టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుండేవారు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. టీటీడీ దేవస్థానం హిందు ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కొత్త నరసింహులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి సమాజంలో మంచి మార్పుకు తనవంతు విశేషంగా కృషి చేశారు. హింది ఉపాధ్యాయుడిగా కూడా పనిచేసిన ఆయన ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధనలు చేసేవారు. కొత్త నరసింహులు మృతదేహానికి టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామం అసిస్టెంట్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ నివాళులు అర్పించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చీనితోటకు నిప్పు : రూ. 3 లక్షలు నష్టం

తొండూరు : మండల కేంద్రమైన తొండూరులో ఓ చీని తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో తోట దగ్ధమైంది. శనివారం తొండూరుకు చెందిన గుత్తి రాము, ముని రెడ్డి చెందిన చీని తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ప్రమాదంలో చీని చెట్లు, టెంకాయ చెట్లు, డ్రిప్పు వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు కంది పంట కూడా కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. దాదాపు మూడు లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ కార్యాలయానికి తాళం

- తాకట్టు బంగారం కోసం ఖాతాదారుల ఆగ్రహం
- రూ.40 లక్షలకుపైగా స్వాహా
- వారం రోజులుగా జరుగుతున్న విచారణ


ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ కార్యాలయానికి తాళం వేసిన ఖాతాదారులు

బి.కొత్తకోట : పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీకి చెందిన బ్రాంచ్ కార్యాలయానికి శనివారం ఖాతాదారులు తాళం వేసి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మి బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటే..మా బంగారాన్ని మరొకరి పేరుతో తాకట్టు పెట్టి రుణాలు మంజూరు చేయించుకుని స్వాహా చేసిన విషయం వెలుగులోకి రావడంతో బి.కొత్తకోట పట్టణ ప్రజల్లో అలజడి నెలకొంది. తమ బంగారం ఉందా లేదా, మా బంగారంపై ఇంకా రుణాలు తీసుకున్నారా అన్న ఆందోళనతో ఖాతాదారులు ఆ కంపెనీ బ్రాంచ్ వద్దకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీనితో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బ్రాంచ్‌లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది చేతివాటం వెలుగులోకి రావడంతో వారం రోజులుగా ఆడిటింగ్, విజిలెన్స్ బృందాలు విచారణ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాము తాకట్టు పెట్టిన బంగారానికి రుణం చెల్లిస్తాం, మా బంగారం ఇవ్వండి అంటూ ఖాతాదారులు బ్రాంచ్ వద్దకు చేరుకున్నారు. దీనితో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది వచ్చాక ఇస్తామని అక్కడున్న సిబ్బంది సమాధానం చెప్పడంతో ఆగ్రహానికి గురయ్యారు. దీంతో గేటుకు తాళం వేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న పోలీసులు బ్రాంచ్ వద్దకు చేరుకుని ఖాతాదారులను సర్దిచెప్పి తాళాలు తీసివేయించారు. కాగా విచారణలో బ్రాంచ్‌కు సంబంధించి మంజూరు చేసిన రుణాల్లో రూ.40 లక్షలకుపైబడి మోసం జరిగినట్టు నిర్ధారించారని విచారణ బృందంలోని ఓ అధికారి చెప్పారు. ఒకరు పెట్టిన తాకట్టు బంగారాన్ని మరొకరి పేరుతో అధిక రుణం మంజూరు చేసి అసలైన ఖాతాదారునికి వారు తీసుకున్న మేర రుణం చెల్లించి ఆపై మంజూరు చేసుకున్న రుణం సొమ్మును ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు సిబ్బంది పంచుకున్నట్టు తేలిందని చెప్పారు. వీరిలో ఒక ముఖ్య సిబ్బంది పరారైనట్టు చెబుతున్నారు. అతను లేకపోవడంతోనే తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకుంటామని ఖాతాదారులు చెబుతున్నా అతని కోసం వేచి ఉండాలని చెబుతున్నారు. కాగా ఆడిటింగ్, విజిలెన్స్ విచారణ పూర్తయి నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మోసపోయిన ఖాతాదారులు పోలీసులకు లేదా సీబీసీఐడీకి ఫిర్యాదు చేయాలని సిద్ధమవుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

– మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణ, క్రీడల, యువజన శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల నిర్వహణలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేగం కన్నా ప్రాణాలు గొప్పవని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించేలా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులపై అవసరం మేరకు వేగ నిరోధక సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. అధిక శాతం రోడ్డు ప్రమాదంలోనే ప్రజలు మరణిస్తున్నారని, ఈ విషయం గుర్తించుకొని సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నిడిపేవారిపైన, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తరచూ డ్రంక్ డ్రైవ్ తనిఖీలు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా సేఫ్టీ డ్రైవింగ్ చేసిన బస్ డ్రైవర్‌లను సన్మానించారు. ఆర్‌టీవో కె. ప్రసాద్, మదనపల్లె రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి అశోక్ ప్రతాప్, రాయచోటి మున్సిపల్ కమీషనర్ వాసు బాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ ధనుంజయ, ఇతరా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

15 మంది జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : జూదం ఆడుతున్న 15 మందిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పివి రమణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండమీదపల్లెకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీస్ దళాలు, స్థానిక సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో తంబళ్లపల్లె, గుర్రంకొండ, రాయచోటి, గాలివీడు, రామాపురం, పెద్దమండ్యం పరిసర ప్రాంతాలకు చెందిన 15 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి రూ. 2.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 16 ద్విచక్ర వాహనాలు, 14 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు చేసినా, జూదం నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్పందించరా?
- జిల్లా మంత్రి రాజీనామా చేయాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని చెప్పడానికి జిల్లాలో గౌతమిపై జరిగిన యాసిడ్ దాడి ఘటనే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఎన్నికల ముందు మహిళల రక్షణ, అండగా ఉంటానని ప్రచారం చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మహిళలపై దాడులు జరుగుతున్నా స్పందించక పోవడం సిగ్గు చేటన్నారు. జిల్లాకు చెందిన మంత్రి బాధ్యత వహించి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో మహిళలకు ముఖ్యంగా యువతలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నిశ్చితార్థం అయ్యి త్వరలో పెళ్ళి చేసుకోబోతున్న గౌతమిపై క్రూరత్వంగా యాసిడ్ దాడి చేసి కత్తితో తీవ్రంగా గాయపరిచిన టీడీపీ నాయకుడు మురళి కుమారుడు గణష్ అధికార పార్టీ అండ చూసుకొని ఇలాంటి ఆకృత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. కేసు తప్పుదోవ పట్టించకుండా ఇలాంటి వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందించి, మహిళల రక్షణ కోసం దిశా స్టేషన్‌లు, ప్రత్యేక చట్టాలు కల్పించి మహిళలకు రక్షణ కల్పించారని తెలిపారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం:
సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా దాడులు చేస్తూ, కేసులు పెడుతూ లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ప్రతి చోట పేదలు, మధ్య తరగతి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పతకం ప్రకారం దాడులు చేస్తూ సూపర్‌సిక్స్ నుంచి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న వంశీని టార్గెట్ చేస్తూ ఫిర్యాదు వెనక్కి తీసుకొన్న వ్యక్తి వద్ద మళ్లీ సంతకాలు చేయించి కేసులు పెట్టారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, నందాబాల, ఎంపీటీసీ బండారు మల్లి, డీ వీరమణ, దామర్లసిద్దయ్య, రత్తయ్య పాల్గొన్నారు.

భాషా సంస్కృతికి వన్నె తెచ్చిన భూతపురి

- నేడు 88వ జయంతి
- బ్రౌన్‌లో 23వ సాహిత్య పురస్కార ప్రదానం


డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ (ఫైల్)

కడప కల్చరల్ : జిల్లాకు వన్నె తెచ్చిన మహాకవులలో డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ ప్రముఖంగా నిలుస్తారు. అవధానిగా భాషాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా జ్యోతిష్య, వాస్తు శాస్త్రాల నిపుణునిగా, సంస్కృతాంధ్రంలో మహాకవిగా పేరుగాంచారు. ఆయన 88వ జయంతి సందర్భంగా ఆదివారం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆయన పేరిట ఏర్పాటు చేస్తున్న స్మారక సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం
మన జిల్లాకు కవుల గడపగా పేరుంది. ప్రముఖులైన కవులెందరో జిల్లా పేరును ఇనుమడింపజేశారు. వారిలో నిన్నటితరం కవి సంస్కృతాంధ్ర సాహితీవేత్త, మహావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ ముందు వరుసలో ఉంటారు. ఆయన రాసిన శ్రీకృష్ణభారతం తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం కల్పించింది.

ఆయన అనంతరం వారి కుమారులు ఆయన పేరిట స్మారక ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఓ పండితునికి సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్నారు. అల్లసాని పెద్దన సాహితీ పీఠంతో కలిసి యేటా క్రమం తప్పకుండా ఈ విశిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆయన పేరిట 88వ జయంతి సందర్భంగా 23వ స్మారక అవార్డును స్థానిక ప్రముఖ సాహితీవేత్త పుత్తా పుల్లారెడ్డికి అందజేయనున్నారు.

బాల్యం నుంచే...
జిల్లాలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో ఓ పండితుడు పురాణ ప్రవచనం చేస్తున్నారు. ఓ రోజు ఆయన ఆకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. కానీ పక్కనే ఉన్న 13 సంవత్సరాల ఆయన కుమారుడు తండ్రి స్థానంలో పురాణ ప్రవచనం మొదలు పెట్టాడు. మిగతా 13 రోజులపాటు ఆ బాలుడే పురాణ ప్రవచనం చేశాడు. ఆ బాలుడు భూతపురి సుబ్రమణ్యశర్మ.

కవి డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 1938 ఫిబ్రవరి 14న వల్లూరు సమీపంలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. తండ్రి సుబ్బయ్యశర్మ మహాపండితులు ఆయన నుంచి కుమారుడు సుబ్రమణ్యశర్మకు సాహిత్య వారసత్వం లభించింది. తండ్రి వద్దే సంస్కృతాంధ్రలను అవపోసాన పట్టారు. ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూలులో చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 4వ యేటనే ఛందోబద్ధంగా కవిత్వం చెప్పడం మొదలు పెట్టారు. తండ్రి సుబ్బయ్యతోనే కవితా రచనలు పోటీపడి ఒప్పించేవారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వద్ద ఆశువుగా పద్యాలు, సంస్కృత శ్లోకాలు చెప్పి ఆశీస్సులు, ప్రశంసలు పొందారు. స్వామి జయేంద్ర సరస్వతి కూడా భూతపురి సాహిత్య పటిమకు ముగ్ధుడై ఆశీర్వదించి తన సభల్లో ప్రసంగానికి అవకాశం ఇచ్చారు.

బహుముఖ ప్రజ్ఞ :
డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిగా, అవధానిగా, జ్యోతిష శాస్త్రం, వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్రేయేతర ప్రాంతాలలో కూడా పేరు పొందారు. 49 సంవత్సరాలపాటు కవితా సరస్వతిని ఆరాధించారు. ఆయన శ్రీరామభక్తుడు. తన రచనలన్నీ శ్రీరామునికే అంకితమిచ్చారు. 1989లో డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల సమక్షంలో సువర్ణ గండపేండేర సత్కారం జరిగింది. 1997లో కడప నగరంలో ఆయన గజారోహణం చేశారు. స్వర్ణ హస్త కంకణ సత్కారం స్వీకరించారు. ఉభయ కవి సార్వభౌమ బిరుదు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, పలు సాహితీ సంస్థల నుంచి ఎన్నో బిరుదులు పొందారు. ఆయన పేరిట కుమారుడు డాక్టర్ శివరామ సురేంద్ర శర్మ, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రిలు స్మారక సంస్థను ఏర్పాటు చేసి యేటా ఆయన జయంతి నాడు సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేస్తున్నారు.